వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
TGTEL/25/A4812
తెలుగు దినపత్రిక
సంపుటి : 01| సంచిక : 64 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ మంగళవారం | జూన్ 16, 2026

## 'అన్నలు' లేరని అలుసు తీసుకుంటే ఖబర్దార్!

- వారంతా ఇప్పుడు మా పార్టీలోనే ఉన్నారు..
- సింగరేణి అక్రమాలను నిలదీస్తూనే ఉంటాం
- 'బొగ్గుబాయి' బాటలో కవిత
- ఆర్కే 7 గని వద్ద తీవ్ర ఉద్రిక్తత..
- గేట్లు తోసుకుని లోపలికి వెళ్లిన టీఆర్ఎస్ శ్రేణులు




**మంచిర్యాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత ఆధ్వర్యంలో చేపట్టిన భూగర్భ గని వద్ద 'బొగ్గుబాయి' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7 గని ఆవరణలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన కవిత, టీఆర్ఎస్ శ్రేణులు, కార్మిక సంఘం నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, పార్టీ కార్యకర్తలకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. చివరకు పోలీసుల బారికేడ్లను, గేట్లను తోసుకుంటూ కవితతో పాటు పార్టీ శ్రేణులు గని ఆవరణలోకి దూసుకెళ్లాయి.

## యూరియా యాప్‌ను తక్షణమే తొలగించాల్సిందే!

### బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల మహాధర్నా






## రైతు వేదికల్లో విత్తనాలు సిద్ధంగా ఉంచండి

- బోనస్ ఇచ్చే 7 రకాల సన్నవడ్లపై సబ్సిడీ ఇవ్వాలి
- సన్నాలు పండించే రైతుల డేటా సేకరించండి
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- వ్యవసాయంలో 'ఏఐ', ఆధునిక సాంకేతికత వినియోగం పెరగాలి
- నోడల్ ఏజెన్సీగా అగ్రికల్చర్ వర్సిటీ..
- ఉన్నతస్థాయి సమీక్షలో కీలక నిర్ణయాలు

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో ధాన్యం దిగుబడిపై వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించిన 7 రకాల సన్న వరి విత్తనాలను రైతు వేదికల్లో అందుబాటులో ఉంచాలని, వాటిని రైతులకు సబ్సిడీపై సరఫరా చేయాలని మార్గనిర్దేశం చేశారు. రాష్ట్రంలో సన్నవడ్లు పండించే రైతుల పూర్తి డేటాను సేకరించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగ బలోపేతం, సాంకేతికత వినియోగంపై అధికారులకు ఆయన పలు కీలక సూచనలు చేశారు. వ్యవసాయ శాఖలో సాంకేతిక పరిజ్ఞానాన్ని, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగాన్ని మరింత పెంచాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని సాంకేతిక సహకారాన్ని విస్తరించుకోవాలన్నారు. విత్తనాల ఎంపిక నుంచి ధాన్యం కొనుగోళ్ల వరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో ప్రారంభించిన పైలెట్ ప్రాజెక్ట్ ఫలితాలను మరిన్ని ప్రాంతాలకు విస్తరించాలన్నారు. మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని, ఆయిల్ ఫెడ్‌ను మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. వ్యవసాయ మందులు, ఎరువుల పంపిణీని మరింత పారదర్శకం చేసేందుకు ప్రత్యేక యాప్‌ను తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. యాప్ ద్వారా బుక్ చేసుకున్న యూరియాను రైతు వేదికల ద్వారానే పంపిణీ చేయాలని, జిల్లా స్థాయిలో యూరియా పంపిణీ పర్యవేక్షణ బాధ్యతను అదనపు కలెక్టర్లకు అప్పగించాలని ఆదేశించారు. రాష్ట్రానికి అవసరమైన యూరియా, ఇతర ఎరువుల కేటాయింపులపై ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాయాలని సీఎం పేర్కొన్నారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే ఎరువులన్నీ తెలంగాణకే దక్కేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ విషయమై రాష్ట్రంలోని అన్ని పార్టీల ఎంపీలతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి, ప్రస్తుత ఎరువుల పరిస్థితిని వివరించాలని అధికారులకు సూచించారు. ఈ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు,

సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధిపై మాకు ఎవరి పాఠాలూ అవసరం లేదు

- సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి ఘాటు స్పందన
- హైదరాబాద్ మెట్రోకు కేంద్రం పూర్తి సహకారం..
- దొడ్డిదారిన ఆపే సంస్కృతి మాది కాదు
- మేము రేవంత్‌కు కాదు.. తెలంగాణ ప్రజలకే జవాబుదారీ




**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ, హైదరాబాద్ నగరాల అభివృద్ధి పట్ల తమకు పూర్తి చిత్తశుద్ధి ఉందని, దీనిపై తమకు ఎవరూ పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఎవరి కోసమో తాము రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడం లేదని ఆయన తేల్చి చెప్పారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన విమర్శలపై కిషన్ రెడ్డి ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఘాటుగా స్పందించారు. దేశవ్యాప్తంగా మిగతా మెట్రో ప్రాజెక్టుల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కూడా కేంద్రం పూర్తి సహకారం అందిస్తోందని, తాను వద్దంటే ప్రాజెక్టులు ఎక్కడా ఆగవని పేర్కొన్నారు. ప్రాజెక్టులను దొడ్డిదారిన ఆపే సంస్కృతి బీజేపీకి లేదని, బహుశా అది కాంగ్రెస్‌కే ఉండొచ్చని కిషన్ రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మెట్రో ఫేజ్–1కు గతంలోనే కేంద్రం రూ.1,250 కోట్లు మంజూరు చేసిందని గుర్తుచేశారు. అనాలోచితంగా, దుందుడుకు ధోరణిలో సీఎం మాట్లాడటం సమంజసం కాదన్నారు. "నాతో పాటు ప్రధాని మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి రేవంత్ రెడ్డి లేదా కాంగ్రెస్ పార్టీ సర్టిఫికెట్లు అవసరం లేదు. మేము రేవంత్ రెడ్డికి కాదు.. తెలంగాణ ప్రజలకు జవాబుదారీ" అని ఆయన స్పష్టం చేశారు.

## 'ఈగిల్ ఫోర్స్' మెరుపు దాడులు

- గోవా, బెంగళూరుల నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ రవాణా
- సినీ ప్రముఖులతో సహా 44 మంది కస్టమర్ల గుర్తింపు
- 19 మంది పోలీసుల అదుపులోకి..
- 14 మందికి గంజాయి పాజిటివ్



వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
మంగళవారం, జూన్ 16, 2026

# తెలంగాణ అభివృద్ధిపై మాకు ఎవరి పాఠాలూ అవసరం లేదు

- సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి ఘాటు స్పందన
- హైదరాబాద్ మెట్రోకు కేంద్రం పూర్తి సహకారం..
- దొడ్డిదారిన ఆపే సంస్కృతి మాది కాదు
- మేము రేవంత్‌కు కాదు.. తెలంగాణ ప్రజలకే జవాబుదారీ

**(మొదటి పేజీ తర్వాత.. )** తెలంగాణ బిడ్డగా ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తాను చేసిన పోరాటాన్ని కిషన్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. దిల్లీకి వచ్చి రెండుసార్లు ధర్నా చేశానని, పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందిన తర్వాతే ఏపీ భవన్‌లో ఆమరణ దీక్ష విరమించానని తెలిపారు. రాష్ట్రంలో రైల్వేస్టేషన్ల అభివృద్ధి కోసం నాడు కేసీఆర్‌కు, నేడు రేవంత్ రెడ్డికి లేఖలు రాశానని.. రేవంత్ కోరితే కాకుండా, కేంద్ర ప్రభుత్వమే బాధ్యతగా తీసుకుని రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు చేపట్టిందని వివరించారు. నాడు కేసీఆర్ సహకరించకపోయినా ఎంఎంటీఎస్ ఫేజ్–2ను ప్రధాని మోదీ చేతుల మీదుగానే ప్రారంభించుకున్నామని, రాష్ట్రానికి రాదనుకున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీని కూడా సాధించామని చెప్పారు. రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా కేంద్రం సమానంగా సహకరిస్తోందని చెబుతూ కిషన్ రెడ్డి కొన్ని గణాంకాలను వివరించారు. రాష్ట్రంలో రూ.1,75,000 కోట్లతో జాతీయ రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులు. 50 ఏళ్లపాటు వడ్డీ లేని సాస్కీ రుణాలను కేంద్రం ఇటీవల రాష్ట్రానికి మంజూరు చేసింది. మూసీ ప్రాజెక్టు కోసం ఏడీబీ రుణానికి కేంద్రం ఎన్వోసీ ఇచ్చింది. ఎన్‌సీడీసీ ద్వారా పదేళ్లుగా తెలంగాణకు రూ.లక్ష కోట్లు మంజూరు. ధాన్యం కొనుగోళ్ల కోసం రూ.37 వేల కోట్లు మంజూరు చేసి, ఇప్పటికే రూ.34 వేల కోట్లు అందజేత. "కేంద్రం నిధులిస్తుంటే కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారనడం దిగజారుడు రాజకీయం. మెట్రో అంశంలో బీజేపీపై కావాలనే బురదజల్లుతున్నారు. మెట్రో రైలు ప్రాజెక్ట్‌ను నేనెందుకు ఆపాలని చెబుతాను? తెలంగాణలో కేంద్రం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. రాష్ట్ర అభివృద్ధి మా బాధ్యత. నాపై సీఎం రేవంత్ చేస్తున్నవన్నీ తప్పుడు ఆరోపణలే." అని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి ఆరోపించారు.

# 'ఈగిల్ ఫోర్స్' మెరుపు దాడులు

- గోవా, బెంగళూరుల నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ రవాణా
- సినీ ప్రముఖులతో సహా 44 మంది కస్టమర్ల గుర్తింపు
- 19 మంది పోలీసుల అదుపులోకి..
- 14 మందికి గంజాయి పాజిటివ్



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణలోని వివిధ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో గంజాయి, డ్రగ్స్ విక్రయాలు, వినియోగంపై భారీగా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ప్రత్యేక విభాగం 'ఈగిల్ ఫోర్స్' మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో మెరుపు దాడులు నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా మొత్తం 19 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారికి తక్షణమే వైద్య పరీక్షలు నిర్వహించగా.. వారిలో 14 మందికి గంజాయి పాజిటివ్‌గా, మరో వ్యక్తికి గంజాయితో పాటు డ్రగ్స్ తీసుకున్నట్లు పాజిటివ్‌గా తేలింది. తాము డ్రగ్స్ వినియోగించినట్లు నిందితులు విచారణలో అంగీకరించడంతో.. తదుపరి చర్యల నిమిత్తం వారిని డీ–అడిక్షన్ సెంటర్లకు తరలించి, వారి తల్లిదండ్రులకు సమాచారం అందించినట్లు ఈగిల్ ఫోర్స్ వెల్లడించింది. డ్రగ్స్ నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు ఈగిల్ ఫోర్స్ మొత్తం 15 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించింది. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లతో పాటు మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లోని పలు అనుమానిత ప్రాంతాల్లో ఈ బృందాలు ఒకేసారి దాడులు చేసి నిందితులను పట్టుకున్నాయి. పోలీసుల విచారణలో నిందితుల నుంచి డ్రగ్స్ మాఫియాకు సంబంధించిన పలు కీలక విషయాలు వెలుగుచూశాయి. గోవాలోని ప్రసిద్ధ 'వగటోర్ బీచ్' ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని ఒక అంతర్రాష్ట్ర ముఠా కొకైన్, ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ, హ్యాష్ ఆయిల్ వంటి ప్రమాదకర మత్తుపదార్థాలను సరఫరా చేస్తున్నట్లు ఈగిల్ ఫోర్స్ గుర్తించింది. ఈ ముఠా గోవా, బెంగళూరుల నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ రవాణా చేస్తూ.. ఇక్కడి సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులకు విక్రయించినట్లు దర్యాప్తులో తేలింది. సాంకేతిక విశ్లేషణ ద్వారా ఈ ముఠాకు సంబంధించిన మొత్తం 44 మంది డ్రగ్స్ వినియోగదారులను పోలీసులు గుర్తించారు. ఈ వినియోగదారులు హైదరాబాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గోవా రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నట్లు విచారణలో బహిర్గతమైంది. డ్రగ్స్ కొనుగోలుకు సంబంధించి నిందితులు జరిపిన ఆర్థిక లావాదేవీలను కూడా పోలీసులు గుర్తించారు. చక్రపాణి, హర్షిత్ రెడ్డి అనే ఇద్దరు ప్రధాన నిందితుల బ్యాంకు ఖాతాలకు వినియోగదారులు ఇప్పటివరకు రూ.3.13 లక్షలకు పైగా ఆన్‌లైన్ ద్వారా నగదు బదిలీ చేసినట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. కాగా, పట్టుబడిన ఈ ఇద్దరు నిందితులు గతంలో 2019లో కూడా ఎన్‌డీపీఎస్ చట్టం కింద డ్రగ్స్ కేసుల్లో అరెస్టయిన పాత నేరస్థులేనని ఈగిల్ ఫోర్స్ బృందం స్పష్టం చేసింది. ఈ నెట్‌వర్క్‌తో సంబంధమున్న మిగతా వారి కోసం గాలింపు తీవ్రం చేశామని అధికారులు తెలిపారు.

EAGLE FORCE
TELANGANA
ELITE ACTION GROUP
FOR DRUG LAW ENFORCEMENT

# 'అన్నలు' లేరని అలుసు తీసుకుంటే ఖబర్దార్!

- వారంతా ఇప్పుడు మా పార్టీలోనే ఉన్నారు..
- సింగరేణి అక్రమాలను నిలదీస్తూనే ఉంటాం
- 'బొగ్గుబాయి' బాటలో కవిత
- ఆర్కే 7 గని వద్ద తీవ్ర ఉద్రిక్తత..
- గేట్లు తోసుకుని లోపలికి వెళ్లిన టీఆర్ఎస్ శ్రేణులు



**మంచిర్యాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత ఆధ్వర్యంలో చేపట్టిన భూగర్భ గని వద్ద 'బొగ్గుబాయి' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7 గని ఆవరణలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన కవిత, టీఆర్ఎస్ శ్రేణులు, కార్మిక సంఘం నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, పార్టీ కార్యకర్తలకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. చివరకు పోలీసుల బారికేడ్లను, గేట్లను తోసుకుంటూ కవితతో పాటు పార్టీ శ్రేణులు గని ఆవరణలోకి దూసుకెళ్లాయి. ఈ సందర్భంగా నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కవిత మాట్లాడుతూ.. కార్మికులను కలుసుకునేందుకు తమకు హక్కు ఉందని, అయితే సింగరేణి యాజమాన్యం తమను అడుగడుగునా అడ్డుకోవాలని చూడడం దుర్మార్గామని మండిపడ్డారు. సింగరేణి యాజమాన్యం గని కార్మికులకు కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించకుండా మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని ఆరోపించారు. కార్మికులకు ఇబ్బంది కలిగేలా వ్యవహరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, అవసరమైతే న్యాయపరంగా ముందుకెళ్తామని హెచ్చరించారు. "గతంలో అడవిలో అన్నలు ఉన్నప్పుడు ఇక్కడ ఒక ధైర్యం ఉండేది. సింగరేణి అధికారులు కూడా పద్ధతిగా పనిచేసేవారు. ఇప్పుడు అడవిలో అన్నలు లేరని, అడిగే దిక్కు లేదని సింగరేణి యాజమాన్యం అలుసుగా తీసుకుని కార్మికులను వేధిస్తోంది. కానీ ఒక్కటి గుర్తుపెట్టుకోవాలి.. అడవిలో ఉన్న అన్నలందరూ ఇప్పుడు టీఆర్ఎస్‌లోనే ఉన్నారు. కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తే వెంటాడి వేటాడుతాం." అని టీఆర్ఎస్ అధినేత్రి కవిత హెచ్చరించారు. సింగరేణి ప్రాంతంలో విపక్షాలను అడ్డుకోవడంపై కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గతంలో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క సింగరేణిలో పర్యటించలేదా? అప్పుడు లేని నిబంధనలు ఇప్పుడే ఎందుకు? కార్మికుల సమస్యలు తెలుసుకుంటే తప్పేంటి?. పోలీసులను అడ్డం పెట్టుకుని ఎన్ని రోజులు అధికారంలో ఉంటారు?" అని ప్రశ్నించారు. కార్మికుల పక్షాన టీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని, సింగరేణిలో జరుగుతున్న అక్రమాలను నిరంతరం నిలదీస్తూనే ఉంటామని ఆమె స్పష్టం చేశారు.

# అమెరికా-ఇరాన్ చారిత్రాత్మక శాంతి ఒప్పందం..

- అయినా వీడని అనుమానాలు!

**న్యూయార్క్,వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పశ్చిమాసియాలో దశాబ్దాలుగా నడుస్తున్న ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా – ఇరాన్ దేశాల మధ్య చారిత్రాత్మక శాంతి ఒప్పందం కుదిరింది. అయితే ఈ ఒప్పందంపై అంతర్జాతీయంగా ఇంకా అనుమానాలు, నీలినీడలు చక్కర్లు కొడుతూనే ఉన్నాయి. ఇరాన్ తన అణ్వాయుధ కార్యక్రమాలను పూర్తిగా వదులుకునేందుకు అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం అధికారికంగా ప్రకటించారు. కాగా, ఈ శాంతి ఒప్పందంలో భాగంగా అమెరికా ఇరాన్‌కు 300 మిలియన్ డాలర్ల ఆర్థిక పరిహారం చెల్లించనుందంటూ వస్తున్న వార్తలను ఆయన తీవ్రంగా ఖండించారు. తన 'ట్రూత్ సోషల్' వేదికగా స్పందించిన ట్రంప్.. అలాంటి ఆర్థిక లావాదేవీలు ఏవీ లేవని, అణ్వాయుధాల నిర్మూలనే ఈ డీల్ యొక్క ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. రానున్న శుక్రవారం స్విట్జర్లాండ్‌లోని జెనీవా నగరంలో ఇరు దేశాల ప్రతినిధులు ఈ చారిత్రాత్మక ఒప్పందంపై అధికారికంగా సంతకాలు చేయనున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదటి రోజు నుంచీ ఇరాన్ విషయంలో ఒకే విధానంతో ఉన్నారని, ఇరాన్ వద్ద అణ్వాయుధాలు లేకుండా చేయడమే తమ లక్ష్యమని యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఒక వీడియో సందేశంలో పేర్కొన్నారు. మరోవైపు ఈ ఒప్పందంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు అత్యంత ఘాటుగా స్పందించారు. ఇరాన్ అణ్వాయుధాలు సేకరించకుండా అడ్డుకోవడమే తన జీవిత ఆశయమని పేర్కొన్న ఆయన.. అమెరికాతో డీల్ కుదిరినా, కుదరకపోయినా ఇరాన్ వద్ద న్యూక్లియర్ వెపన్ ఉండటానికి వీల్లేదన్నారు. తాను ఇజ్రాయెల్ ప్రధానిగా ఉన్నంత కాలం ఇరాన్ అణ్వస్త్ర దేశంగా మారే ప్రసక్తే లేదని నెతన్యాహు తెగేసి చెప్పారు. సీఐఏ డైరెక్టర్ అభ్యంతరం: ఇరాన్ అంతర్గత ఉద్దేశాలపై నిఘా వర్గాల అంచనాలు ఆందోళనకరంగా ఉన్నాయని సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్, అధ్యక్షుడు ట్రంప్‌ను హెచ్చరించారు. శుద్ధి చేసిన యురేనియం విషయంలో ఇరాన్ అధికారులు చెప్తున్న మాటలకు, నిఘా వర్గాలకు దొరికిన సమాచారానికి అస్సలు పొంతన లేదని ఆయన స్పష్టం చేశారు. రాట్‌క్లిఫ్‌తో పాటు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్‌లు కూడా అంతర్గత చర్చల్లో ఇరాన్ నమ్మకద్రోహం చేసే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, పశ్చిమాసియా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్‌లు మాత్రం ఈ శాంతి ఒప్పందానికి పూర్తి మద్దతు పలకడం గమనార్హం. ట్రంప్ కేబినెట్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడాన్ని వైట్‌హౌస్ అధికారిక ప్రతినిధి ఒకరు ధృవీకరించారు. అయితే, అధ్యక్షుడు ట్రంప్ అందరి అంచనాలు, నిఘా నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదనే రక్షణ కవచంతో పాటు, వారి వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను పూర్తిగా నిర్వీర్యం చేయాలనే కఠినమైన షరతులతోనే ఈ డీల్ రూపుదిద్దుకుందని వైట్‌హౌస్ స్పష్టం చేసింది. కాగా, ఈ అంతర్గత విభేదాల లీకులపై అటు సీఐఏ గానీ, ఇటు విదేశాంగ శాఖ గానీ అధికారికంగా స్పందించేందుకు నిరాకరించాయి.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
మంగళవారం, జూన్ 16, 2026

# రూ.258 కోట్లతో 'కాళేశ్వరం' దేవాలయం మాస్టర్ ప్లాన్

- మహా అద్భుతంగా ఆలయ పునర్నిర్మాణం
- కమిషనర్ హనుమంతరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్

**మహాదేవపూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానాన్ని అత్యంత వైభవంగా, సకల సౌకర్యాలతో పునర్నిర్మించేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. ఆలయ ఈఓ కార్యాలయంలో మంగళవారం స్థానిక గ్రామస్థులు, భక్తులతో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ మాస్టర్ ప్లాన్, చేపట్టబోయే భారీ అభివృద్ధి పనుల నమూనాలను ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. ఆలయ విస్తరణ పూర్తయిన తర్వాత ఒకేసారి సుమారు 25 వేల మంది భక్తులు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఒకే ప్రాంగణంలో ఉండి స్వామివారిని దర్శించుకునేలా ఈ అద్భుత ప్రణాళికను రూపొందించినట్లు కమిషనర్ వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కాళేశ్వరం ఆలయ రూపురేఖలను మార్చడమే లక్ష్యంగా భారీగా నిధులను కేటాయించారని కమిషనర్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి: రూ.198 కోట్లు, అష్ట తీర్థాల అభివృద్ధికి: రూ.60 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో పక్షి తీర్థం, వ్యాస తీర్థం, జ్ఞాన తీర్థం వంటి పవిత్ర తీర్థాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు, భక్తుల కోసం ప్రత్యేక ఘాట్ల నిర్మాణం, ఘాట్ నుండి ఘాట్ వరకు పూర్తి స్థాయి రవాణా కోసం రహదారులను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం పనులను దశలవారీగా చేపట్టనున్నారు. మొదటి దశలో ఆలయ దక్షిణ భాగం నుండి పనులు ప్రారంభించి గర్భాలయం పరిసరాలు, చిన్న గోపురాలు, ప్రాకారాలు, ఉప ఆలయాల నిర్మాణ పనులను పూర్తి చేస్తారు. తూర్పు ప్రాకారం మినహా మిగిలిన ప్రధాన పనులన్నీ మొదటి దశలోనే పూర్తవుతాయని, రాబోయే గోదావరి పుష్కరాలు ముగిసిన అనంతరం మిగిలిన పనులను చేపడతామని తెలిపారు. 2027 మే నాటికి తొలి దశ నిర్మాణ పనులను



పూర్తి చేయాలనే గడువును నిర్దేశించుకున్నట్లు కమిషనర్ స్పష్టం చేశారు. ఆలయ పునర్నిర్మాణ మరియు విస్తరణ పనుల నేపథ్యంలో, బుధవారం నుంచి భక్తులకు మూలవిరాట్ దర్శనాలు నిలిపివేయనున్నారు. భక్తుల సౌకర్యార్థం బాలాలయమైన శ్రీ ఆది ముక్తీశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారి దర్శనాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. అభివృద్ధి పనులన్నీ అనుకున్న సమయానికి పూర్తి చేసి, గోదావరి పుష్కరాల లోపు జగద్గురు శృంగేరి పీఠాధిపతిని కాళేశ్వరానికి ఆహ్వానించి వారి పవిత్ర హస్తాల మీదుగా మహా సంప్రోక్షణ, ప్రారంభోత్సవ వేడుకలను జరపడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబుల పూర్తి సహకారంతో ఈ ప్రాజెక్ట్ సాగుతోందని, ఈ చారిత్రాత్మక ఆలయ పునర్నిర్మాణానికి స్థానిక గ్రామస్థులు, వ్యాపారులు, భక్తులు పూర్తి స్థాయిలో సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో ధార్మిక సలహాదారు గోవింద హరి, దేవస్థాన ఈఓ ఎస్. మహేష్, స్థపతి నాయక్, గ్రంథాలయ చైర్మన్ రాజబాపు, కాటారం ఆర్డీవో వెంకటేశ్వర్లు, సర్పంచ్ మోహన్ రెడ్డి, ధర్మకర్తలు సత్యనారాయణ, సీతయ్య, శ్యామ్, సీతారాం, దుర్గయ్య, అశోక్, పద్మ, రాజయ్య, ప్రశాంత్ రెడ్డి, శ్రీధర్ రావు, ఎక్స్ అఫీషియో మెంబర్ నాగేష్ శర్మ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.





## అనాథ పిల్లలకు అండగా 'ప్రణిత'



మానవత్వం చాటుకున్న ఉపాధ్యాయురాలు

**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** గొప్ప మనసుతో ఆలోచించి మానవత్వంతో చేయూతనిస్తే సమాజంలో అనాథలనే వారే ఉండరని నిరూపిస్తున్నారు ఓ ఉపాధ్యాయురాలు. తన పాఠశాలలో చదివిన ఇద్దరు పేద విద్యార్థినులను దత్తత తీసుకొని, వారి చదువుకు అండగా నిలుస్తూ ఆదర్శంగా నిలిచారు. వొజ్జల ప్రణిత అనే ఎస్జీటీ ఉపాధ్యాయురాలు గతంలో హన్మాజిపేట ప్రైమరీ స్కూల్లో పనిచేస్తున్న సమయంలో.. అక్కడ చదువుతున్న చిట్టారి సౌజన్య, చిట్టారి గంగాజల అనే ఇద్దరు విద్యార్థినుల దీన స్థితిని చూసి చలించిపోయారు. వారికి ఎలాగైనా ఉన్నత విద్యను అందించాలని నిశ్చయించుకున్నారు. తన మిత్రురాలైన స్వర్గీయ సుహాసిని (పి.జి.హెచ్.ఎం, గర్ల్స్ హైస్కూల్, వేములవాడ) సహకారంతో 2020 సంవత్సరంలో ఆ ఇద్దరు విద్యార్థినులను దత్తత తీసుకున్నారు. అప్పటినుంచి వారికి కావలసిన పుస్తకాలు, బట్టలు మరియు ఆర్థిక సహాయాన్ని నిరంతరాయంగా అందిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఆ పిల్లలు మర్రిపల్లి కేజీబీవీ రశాలలో గంగాజల 10వ తరగతి, సౌజన్య 9వ తరగతి చదువుతున్నారు. ప్రణిత టీచర్ ప్రస్తుతం బదిలీపై మానకొండూరు పాఠశాలకు వెళ్లినప్పటికీ.. ఆ పిల్లల బాధ్యతను మరువకుండా ఇప్పటికీ సహాయం అందిస్తూ వారి విద్యాభివృద్ధికి తోడ్పడడం విశేషం. ఈ సేవా కార్యక్రమంలో మరో అభినందనీయమైన విషయం ఏమిటంటే.. ప్రణితకు సహకరించిన కోడిపాక పవన్ కుమార్, సుహాసిని దంపతులు ప్రస్తుతం కీర్తిశేషులైనప్పటికీ, వారి కుమారుడు కోడిపాక అన్వేష్ తన తల్లి ఇచ్చిన మాటకు కట్టుబడ్డారు. తల్లి ఆశయాలను గౌరవిస్తూ, ఆ విద్యార్థినుల విద్యాభివృద్ధికి తనవంతు ఆర్థిక సహాయాన్ని అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మునుముందు కూడా ఆ ఇద్దరు అమ్మాయిల చదువుకు కావలసిన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ప్రణిత టీచర్, అన్వేష్ స్పష్టం చేశారు. విపత్కర పరిస్థితుల్లోనూ ఆ ఇద్దరు పిల్లలకు అండగా నిలుస్తున్న వీరి గొప్ప మనసును, మానవత్వాన్ని స్థానికులు, విద్యాశాఖ అధికారులు అభినందిస్తున్నారు.

## వర్షాకాలం ముందస్తు చర్యలపై సమీక్ష

- అధికారులకు కలెక్టర్ సత్య శారద కీలక ఆదేశాలు
- శిథిలావస్థ భవనాలపై నిఘా..
- విద్యుత్, అగ్నిమాపక శాఖలు అప్రమత్తం

**వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రానున్న వర్షాకాలంలో సంభవించే సహజ విపత్తులు, వరదల నివారణకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విపత్తుల నివారణ, సీజనల్ వ్యాధుల అదుపుపై వివిధ శాఖల అధికారులతో ఆమె ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గత ఏడాది వర్షాకాలంలో ఎదురైన అనుభవాలు, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో తలెత్తిన సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఆయా శాఖల అధికారులు ప్రత్యేక ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా జిల్లాలోని శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, పాత ఇళ్లను తక్షణమే గుర్తించి తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల విద్యుత్





ప్రమాదాలు జరగకుండా ముందస్తు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్‌సీ ఆనంద్‌ను ఆదేశించారు. అలాగే, ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అగ్నిమాపక శాఖ అధికారులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు పూర్తి అప్రమత్తతతో సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల ఆరోగ్య శాఖ అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాంబశివరావుకు కలెక్టర్ సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దోమల నివారణ, సురక్షిత తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన సీజనల్ వ్యాధుల అవగాహన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు వినూత్నంగా 'నాలుగు రకాల చెత్త సేకరణ' విధానాన్ని తీసుకురావాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. మొదటగా జిల్లాలో ఏదైనా ఒక చిన్న గ్రామాన్ని ఎంపిక చేసి, అక్కడ పైలట్ ప్రాజెక్ట్‌గా ఈ నాలుగు రకాల చెత్త సేకరణను విజయవంతంగా అమలు చేయాలని, ఆ తర్వాత జిల్లా అంతటా విస్తరించాలని పేర్కొన్నారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు జి. సంధ్యారాణి, వై.వి. గణేష్, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, ఆర్డీవోలు, వివిధ శాఖల ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
మంగళవారం, జూన్ 16, 2026

## 'నమో జెన్ జీ కాన్‌క్లేవ్' పోస్టర్ ఆవిష్కరణ



**పరకాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం విజయవంతంగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా.. ఈ నెల 18న హనుమకొండలో భారీ ఎత్తున 'నమో జెన్ జీ కాన్‌క్లేవ్' సదస్సును నిర్వహించనున్నట్లు బీజేపీ ప్రతినిధులు వెల్లడించారు. పరకాలలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షులు గాజుల నిరంజన్ అధ్యక్షతన, జిల్లా నమో యువ కన్వీనర్ కాసర్ల రుత్విక్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమ వాల్ పోస్టర్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.కాళీ ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డా.సంద్ర మధు, కౌన్సిలర్లు కుక్కల విజయ్, పూర్ణాచారి, జిల్లా నాయకులు ఎర్రం రామన్న, మండల ప్రధాన కార్యదర్శి సంగ పురుషోత్తం, కొలనుపాక భద్రయ్య, నారాయణదాసు, వేముల ఆంజనేయులు–సదారని, వెండిశెట్టి శారద, మెంతుల సురేష్, సంఘ నరేష్ పాల్గొన్నారు. అలాగే బీజేవైఎం నాయకులు సిద్ధు, రవివర్మ, శివ, మహేష్, సోను, హరికృష్ణ తదితర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## తహసిల్దార్ కార్యాలయంలో పాము

**పర్వతగిరి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఉదయం స్వల్ప కలకలం చోటుచేసుకుంది. ఆఫీసు లోపలికి పాము రావడంతో సిబ్బంది, స్థానిక ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. కార్యాలయ వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం ఆఫీసును తెరవడానికి వీఆర్ఏ కేదారి వచ్చారు. ఆయన తలుపులు తీసి లోపలికి వెళ్లగానే ఒక్కసారిగా ఎదురుగా పాము కనిపించింది. దాంతో భయభ్రాంతులకు గురైన ఆయన వెంటనే వెనక్కి వచ్చేసి సిబ్బందిని అప్రమత్తం చేశారు. అందరూ చూస్తుండగానే ఆ పాము కార్యాలయంలోని ఒక బీరువా కిందకు దూరింది. సమాచారం అందుకున్న తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది, స్థానికులు వెంటనే అప్రమత్తమై పామును జాగ్రత్తగా బయటకు తరలించేందుకు ప్రయత్నించారు. అయితే ఈ క్రమంలో పాము మృతి చెందింది. తలుపులు తీసిన వెంటనే అలర్ట్ అవ్వడంతో అటు కార్యాలయ సిబ్బందికి గానీ,ఇటు పనుల కోసం వచ్చిన ప్రజలకు గానీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక సాంకేతికత

- తొలిసారిగా 'హైపో-ఆర్ట్' విధానం



**హైదరాబాద్/హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** క్యాన్సర్ రోగుల చికిత్సలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ యశోద హాస్పిటల్స్ సరికొత్త విప్లవాత్మక సాంకేతికతకు శ్రీకారం చుట్టింది. వృద్ధులు, తీవ్రమైన ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న క్లిష్టమైన క్యాన్సర్ రోగుల కోసం భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా 'ఎంఆర్–లినాక్' యంత్రం ద్వారా 'హైపోఫ్రాక్షనేటెడ్ అడాప్టివ్ రేడియేషన్ థెరపీ' (హైపో–ఆర్ట్) విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. గతంలో వయసు పైబడిన వారిలో లేదా ఇతర తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్నవారిలో ముదిరిన క్యాన్సర్ కణితులకు చికిత్స చేయడం వైద్యులకు పెద్ద సవాలుగా ఉండేది. సాంప్రదాయ రేడియేషన్ పద్ధతుల్లో ఎక్కువ రోజులు చికిత్స అందించాల్సి రావడం, దానివల్ల తీవ్రమైన దుష్ప్రభావాలు ఎదురుకావడం వంటి ఇబ్బందులు ఉండేవి. అయితే, ప్రస్తుత 'హైపో–ఆర్ట్' విధానం ఇలాంటి క్లిష్టమైన రోగులకు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ సరికొత్త చికిత్సా విధానం గురించి యశోద హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ప్రదీప్ కుమార్ కారుమంచి మాట్లాడుతూ.. "వయస్సు పైబడటం లేదా ఇతర సంక్లిష్ట వైద్య చరిత్రలు ఉన్నప్పటికీ ఇప్పుడు క్యాన్సర్‌కు అత్యంత సమర్థవంతంగా చికిత్స చేయవచ్చు. ఈ హైపో–ఆర్ట్ విధానం ద్వారా ప్రతి సెషన్ లోనూ క్యాన్సర్ కణితిపై అత్యంత ఖచ్చితత్వంతో కూడిన శక్తివంతమైన రేడియేషన్ మోతాదును అందించవచ్చు. దీనివల్ల చికిత్స తీసుకోవాల్సిన రోజుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని అన్నారు. ఈ అత్యాధునిక సాంకేతికత వల్ల రోగులు పదేపదే ఆసుపత్రి చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. ఫలితంగా వృద్ధ రోగులకు శారీరక శ్రమ, చికిత్స తాలూకు అలసట చాలా వరకు తగ్గుతాయి. ఈ చికిత్సను మరింత సురక్షితంగా, ఖచ్చితత్వంతో అందించడానికి డాక్టర్ కారుమంచి నేతృత్వంలోని వైద్య బృందం హై–ఫీల్డ్ ఎంఆర్ఐ స్కానర్ కలిగిన అత్యాధునిక ఎంఆర్–లినాక్ యంత్రాన్ని ఉపయోగిస్తోంది. ఈ విధానం క్యాన్సర్ బాధితుల్లో సరికొత్త ఆశలను రేకెత్తిస్తోంది.

# యూరియా యాప్‌ను తక్షణమే తొలగించాల్సిందే!

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల మహాధర్నా
- యాప్ తెచ్చి రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారు
- బాజిరెడ్డి జగన్ మండిపాటు

**నిజామాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన యూరియా యాప్‌ను తక్షణమే తొలగించాలని బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బాజిరెడ్డి జగన్ డిమాండ్ చేశారు. ఈ యాప్ విధానాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం సిరికొండ మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆయన మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తరలివచ్చిన వందలాది మంది రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు 'యూరియా యాప్ పోవాలి.. రేవంత్ రెడ్డి దిగిరావాలి' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేయడంతో ఆ ప్రాంతం హోరెత్తింది. ధర్నానుద్దేశించి బాజిరెడ్డి జగన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. అందులో భాగమే ఈ యూరియా యాప్ అని, దీనివల్ల సామాన్య రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని మండిపడ్డారు. సాంకేతికత పేరుతో కాలయాపన చేయకుండా రైతులకు తక్షణమే యూరియాను నేరుగా అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఒకపక్క సకాలంలో రైతుబంధు ఇవ్వకుండా రైతులను ప్రభుత్వం నట్టేట ముంచుతోందని, మరోపక్క ఎరువుల కొరత సృష్టిస్తోందని ధ్వజమెత్తారు. "గడిచిన బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులను రాజులను చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కింది. నాడు రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించడంతో పాటు అన్ని సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేశాం. కానీ నేడు రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల అన్నదాతలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. రైతులు ఇంతగా ఆందోళన చెందుతున్నా రేవంత్ సర్కార్ పట్టించుకోకపోవడం సిగ్గుచేటు." అని బీఆర్ఎస్ రూరల్ ఇన్‌ఛార్జ్ బాజిరెడ్డి జగన్ అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు నారబోయిన శ్రీనివాస్, ఆకుల తిరుమల, లక్ష్మి, నరసయ్యలతో పాటు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక రైతులు పాల్గొని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా తమ నిరసనను వ్యక్తం చేశారు.

# అనుమానాస్పద వ్యక్తులు కనబడితే సమాచారం అందించండి

- వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్
- కాజీపేట రైల్వే స్టేషన్‌లో తనిఖీ
- స్వయంగా పరిశీలించిన సీపీ
- అంతర్రాష్ట్ర నేరస్థుల కదలికలపై నిఘా
- 4 ప్రత్యేక పోలీసు బృందాల ఏర్పాటు



**వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రజల భద్రతే లక్ష్యంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. తమ పరిసరాల్లో ఎవరైనా గుర్తు తెలియని లేదా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కాజీపేట రైల్వే స్టేషన్‌లో సీసీఎస్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనుమానితుల తనిఖీలను పోలీస్ కమిషనర్ ఆకస్మికంగా సందర్శించి, స్వయంగా తనిఖీల్లో పాల్గొని పోలీసుల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల నుంచి, ముఖ్యంగా ఉత్తర భారతదేశానికి చెందిన కొందరు నేరస్థులు వరంగల్ నగరానికి చేరుకుని ఇళ్ల చోరీలు, చైన్ స్నాచింగ్‌లు వంటి ఆస్తి నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైందన్నారు. వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లు దేశంలోని వివిధ రాష్ట్రాలను కలిపే ప్రధాన జంక్షన్లుగా ఉండటంతో నేరస్థులు సులభంగా రైలు మార్గాల ద్వారా ఇక్కడికి చేరుకుంటున్నారని, నేరాలకు పాల్పడిన అనంతరం తిరిగి తమ స్వస్థలాలకు పారిపోతున్నారని తెలిపారు. ఈ తరహా అంతర్రాష్ట్ర నేరాలను అరికట్టేందుకు రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా సీసీఎస్ పోలీసుల ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సీపీ ప్రకటించారు. వీటిలో రెండు బృందాలు వరంగల్ రైల్వే స్టేషన్‌లో, మరో రెండు బృందాలు కాజీపేట రైల్వే స్టేషన్‌లో విధుల్లో ఉంటాయి. ఈ బృందాలు ప్రభుత్వ రైల్వే పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సహకారంతో షిఫ్ట్‌ల వారీగా నిరంతరం నిఘా ఉంచుతాయి. ఉత్తర భారతదేశం సహా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లలో ప్రయాణించే అనుమానిత వ్యక్తులను ఈ ప్రత్యేక బృందాలు గుర్తించి, వారి సామాగ్రిని తనిఖీ చేస్తాయని సీపీ వివరించారు. "అనుమానితుల వ్యక్తిగత వివరాలు, వేలిముద్రలు, ఫొటోలను సేకరించి.. 'ఫేస్ రికగ్నిషన్' సాంకేతికతతో పాటు పోలీసు శాఖ వద్ద ఉన్న ఆధునిక డేటాబేస్‌లతో సరిపోల్చి పరిశీలిస్తున్నాం. గతంలో నేర చరిత్ర ఉన్నట్లు తేలితే సాంకేతిక పరికరాల ద్వారా క్షణాల్లో తెలిసిపోతుంది. అలాంటి వారిని వెంటనే అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ జరుపుతాం." అని సీపీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. ఈ తనిఖీల్లో క్రైమ్ అదనపు డీసీపీ బాలస్వామి, ఏసీపీ సదయ్య, జీఆర్‌పీ డీఎస్పీ కృపాకర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, కాజీపేట ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ నరేష్ కుమార్, ఎస్ఐ అభినవ్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

**వేములవాడ రూరల్ ఎస్సై వెంకట్రాజం**



**వేములవాడ రూరల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను మండల ప్రజలు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వేములవాడ రూరల్ ఎస్సై వెంకట్రాజం పిలుపునిచ్చారు. కోర్టుల్లో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ తదితర కేసులను ఇరువర్గాల పరస్పర అంగీకారంతో, సామరస్యపూర్వకంగా త్వరితగతిన పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఒక అద్భుతమైన వేదిక అని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కోర్టుల చుట్టూ తిరగడం వల్ల సమయం, డబ్బు వృధా అవుతాయని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని కేసులను త్వరగా ముగించుకోవాలని సూచించారు. కేసుల శాశ్వత పరిష్కారానికి సంబంధిత ఇరుపక్షాలు పూర్తిగా సహకరించాలని కోరారు. పరిష్కరించుకోదగిన కేసులు క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, చిన్నచిన్న పెట్టి కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి పంపకాల తగాదాలు, కుటుంబ కలహాలు, వైవాహిక వివాదాలు,బ్యాంకు రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు ఉన్నాయి. లోక్ అదాలత్‌లో లభించే తీర్పుకు కోర్టు తీర్పుతో సమానమైన గుర్తింపు ఉంటుందని, పైగా ఇరువర్గాల మధ్య ఎలాంటి గొడవలు లేకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. మండల పరిధిలోని కక్షిదారులు ఈ నెల 20న జరిగే మెగా లోక్ అదాలత్‌కు హాజరై తమ కేసులను పరిష్కరించుకోవాలని ఎస్సై వెంకట్రాజం కోరారు.